క్లుప్తంగా

మహేశ్‌గౌడ్‌ను కలిసిన శ్రీనివాస్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పీసీసీ నూతన అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను పీసీసీ సెక్రటరీ గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు బాల్‌రెడ్డి, ఎల్లా శ్రీనివాస్‌రెడ్డి, సందీప్, భూషణ్, లింగారెడ్డి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారన్నారు.

నేతలు కూడా..



మహేశ్‌ను కలిసిన నేతలు

సిద్దిపేటజోన్: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను సిద్దిపేట నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సిద్దిపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరకుల శివప్ప, మాజీ కౌన్సిలర్ తాడూరి శ్రీనివాస్‌గౌడ్‌లు నాగరాజు, తిరుపతిరెడ్డిలతో కలిసి మహేశ్‌గౌడ్‌ను సన్మానించారు. సిద్దిపేటలో పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలని నాయకులకు సూచించారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మాజీ ఎమ్మెల్సీ

చేర్యాల(సిద్దిపేట): నూతన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంగౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

సమన్యాయానికి వేదిక అదాలత్

గజ్వేల్‌రూరల్: రాజీపడదగిన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదపడుతుందని, కక్షిదారులు సత్వర న్యాయం కోసం లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల సేవాధికార సంస్థ చైర్మన్ సౌమ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. రాజీపడదగిన కేసుల పరిష్కారం ద్వారా సత్వర, సమన్యాయం కోసం లోక్‌అదాలత్ చక్కని వేదికని పేర్కొన్నారు. సెప్టెంబర్ 28న గజ్వేల్‌లో జరిగే లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎక్కువ మందికి న్యాయం జరిగేలా న్యాయవాదులు, సంబంధిత అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, మండల్ లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహచారి, యామిని, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



ఆటోలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: అక్రమంగా నిల్వ ఉంచిన ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా అమ్ముతున్నారని పోలీసులకు నమ్మదగిన సమాచారం వచ్చింది. దీంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు వెళ్లి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించారు. దీంతో శ్రీనివాస్, తూర్పటి అశోక్, వానరాశి సంజీవ్, కోదండమ్ శంకర్‌లు ఆటోలో గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఆటోలలో తరలిస్తున్న 55 క్వింటాళ్ల రేషన్ బియ్యం, విక్రయించగా ఉన్న నగదు రూ.15,980 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సమష్టిగా పనిచేద్దాం : టీఎన్జీఓ

సిద్దిపేటజోన్: ఆదర్శ జిల్లాగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు కోసం సమిష్టిగా పనిచేద్దామని టీఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి విక్రమ్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం పబ్లిక్ సర్వెంట్స్ హోంలో జిల్లా పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మురళి, కార్యదర్శిగా వికాస్ రెడ్డి ఎన్నికయ్యారు.

సంపూర్ణ స్వచ్ఛతకు ప్రాధాన్యం

హుస్నాబాద్: సంపూర్ణ స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్నట్లు చైర్‌పర్సన్ ఆకుల రజిత తెలిపారు. మున్సిపల్ సమావేశ మందిరంలో తన అధ్యక్షతన మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, మెప్మా రిసోర్స్‌పర్సన్లకు స్వచ్ఛత హీ సేవా 2024 కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యం

సంపూర్ణ పోషక ఆహారం అందించడంతోనే తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పౌష్టికాహార మహోత్సవం సందర్భంగా మంగళవారం గర్భిణులకు సీమంతం, చిన్న పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు.

మొక్కజొన్న రైతుకు కష్టం



వర్షానికి నేలవాలిన మొక్కజొన్న

- వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- నష్టం అంచనా వేయడంలో అధికారుల అలసత్వం

పై ఫొటోలో కనిపిస్తున్న రైతు బక్కొళ్ల దుర్గయ్య. రాయపోల్ మండలం రామారం గ్రామస్తుడు. రెండు ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. పంట వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 50 వేలు ఖర్చు చేశాడు. కానీ ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చేతికొస్తుందన్న దశలో భారీ వర్షాలతో నేలపాలైంది. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఇది ఒక రైతు దుర్గయ్యదే కాదు మిగతా రైతులది కూడా.

దుబ్బాకటౌన్: గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా చేతికి వచ్చిన మొక్కజొన్న పంట కళ్ల ముందే నేల రాలడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గ్రామాల్లో చెరువులు, కుంటలు అలుగు పారడంతో వరి పంట పొలాలు నీట మునిగిపోయాయి. కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు పంటలు తీవ్రంగా నష్టం వాటిల్లాయి. కానీ నష్టపోయిన పంటలను అంచనా వేయడంలో రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో పంట నష్టపోయిన ఫొటోలను వ్యవసాయ అధికారులకు పంపించాల్సిన దుస్థితి మండలంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని, నష్టం పరిహారం అందించేలా ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

15 ఎకరాల్లో పంట నష్టం



రాయపోల్ మండల కేంద్రంలో రైతుల వద్దకు వెళ్లి క్షేత్ర స్థాయిలో పంట నష్టం వివరాలు సేకరిస్తున్నాం. ఇప్పటి వరకు మండలంలో దాదాపు 15 ఎకరాలలో మొక్కజొన్న పంట నష్టం వివరాలను నమోదు చేసుకున్నాం. సమాచారం అందించిన రైతుల పొలాల దగ్గరకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నాం.

– నరేశ్, రాయపోల్ ఏఓ

వేధింపులకు చర్యలు తప్పవు

- దుబ్బాక సీఐ శ్రీనివాస్

దుబ్బాక: బాలికలను, మహిళలను వేధిస్తే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో బాలికలు, మహిళల రక్షణ చట్టాలతో పాటు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలికలు, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అనేక నూతన చట్టాలు తీసుకు వచ్చిందన్నారు. ప్రతీ విద్యార్థిని పోక్సో చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. చదువుకునే పాఠశాలల్లో, ఇతర ప్రదేశాల్లో విద్యార్థినులు వేధింపులకు గురైతే తక్షణమే పాఠశాల సిబ్బంది షీటీమ్స్‌కు తెలియజేయాలన్నారు. లైంగిక వేధింపుల నివారణకు పిల్లల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులపై ఉందని స్పష్టం చేశారు. యువత సామాజిక మాధ్యమాల ద్వారా ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లు ఆడుతూ అప్పుల పాలై తనువులు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఆగస్టు 15 న దేశభక్తి పాటల పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి స్వాతి, నిషా, నాగరాణి, చంద్రకళ, రేఖ, యశోద, కృష్ణవేణి తదితరులు ఉన్నారు.



దుబ్బాక: విద్యార్థినికి ప్రశంసా పత్రం అందిస్తున్న సీఐ శ్రీనివాస్

ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలి

సిద్దిపేటకమాన్: ప్రశాంతమైన వాతావరణంలో వినాయక నిమజ్జనం కార్యక్రమం జరుపుకోవాలని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. పోలీసు కళాబృందం కనువిప్పు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నెహ్రూ పార్క్ వద్ద ప్రజలకు సోమవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగాగా ఆయన మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు వీటి బారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు.

అనర్హులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇచ్చారని...

– బల్వంతాపూర్ గ్రామస్తుల ఆందోళన

దుబ్బాకరూరల్: అర్హులకు కాకుండా అనర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇచ్చారని ఆరోపిస్తూ మండలంలోని బల్వంతాపూర్ గ్రామ ప్రజలు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రస్తుతం నివాస ఉంటున్న డబుల్ బెడ్రూం ఇళ్లల్లో అర్హులు కాకుండా అనర్హులు ఉంటున్నారని ఆరోపించారు. ఇళ్లు, భూములు, ఆస్తులు ఉన్నవారే డబుల్ బెడ్ రూమ్‌లలో ఉంటున్నారని తెలిపారు. ఇండ్లు లేని నిరుపేదలు కిరాయిలకు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి నిజమైన అర్హులను గుర్తించి వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. తహసీల్దార్, ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు సత్తయ్య, పడిగ యాదయ్య, సత్యనారాయణ, రవీందర్, స్వామి, విద్యాసాగర్, నజీర్ పాల్గొన్నారు.

వర్గల్ రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

వర్గల్(గజ్వేల్): గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్ పర్యవేక్షణలో వర్గల్ ప్రధాన రోడ్డుకు గుంతలను పూడ్చారు. ప్రధాన రోడ్డుకు గుంతలు పేరిట సాక్షి దినపత్రిక కథనాన్ని ప్రచురించగా అధికారులు మంగళవారం స్పందించారు. గుంతల్లో చిప్స్, కంకర పోసి పూడ్చివేశారు. రోడ్డుకు అడ్డుగా పెట్టిన టేబుల్‌ను తీసి వేయించారు. దీంతో వాహన రాకపోకలకు మార్గం సుగమమైంది. అయితే ప్రధాన రోడ్డుకు పూర్తిస్థాయి పటిష్ట మరమ్మతుల కోసం రూ.10 లక్షల నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపినట్లు ఆర్ అండ్‌బీ డిప్యూటీ ఈఈ వెంకటేశం తెలిపారు.



రోడ్డుపై గోతులు పూడ్చి చదును చేస్తున్న సిబ్బంది

గురుకులాల సమస్యలను పరిష్కరించండి

సిద్దిపేటఅర్బన్: గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రోగ్రెసివ్ పేరెంట్ లీగ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మెట్ల శంకర్ అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించి టీచర్లను సన్మానించారు. రాష్ట్రానికి విద్యారంగంలో గొప్ప పేరు తెచ్చిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సమస్యలతో విద్యార్థులు సతమతం అవుతున్నారన్నారు. కనీస వసతుల కల్పనకు ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు శక్తికి మించి పని చేస్తున్నారని దాని ఫలితంగానే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. సిద్దిపేట జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి విద్యార్థుల తల్లిదండ్రులు సైతం కృషి చేయాలన్నారు. విద్యార్థులను కలిసేందుకు తల్లిదండ్రులు రెండో శనివారం మాత్రమే పాఠశాలకు రావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మార్తా, వైస్ ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, పీపీఎల్ స్టేట్ కోఆర్డినేటర్ జనార్ధన్, జిల్లా కమిటీ సభ్యులు మహేశ్వరం శ్రీనివాస్, మల్లేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.

1,929 ఎకరాల్లో పాక్షిక నష్టం

హుస్నాబాద్‌రూరల్: డివిజన్ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు 1,929 ఎకరాల్లో పంటలకు పాక్షికంగా నష్టం జరిగిందని ఏడీఏ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం డివిజన్ కార్యాలయంలో పంట నష్టం వివరాలను వెల్లడించారు. డివిజన్ పరిధిలోని కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో వరి పంట 1,163 ఎకరాల్లో, పత్తి 594 ఎకరాల్లో, 172 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు నీట మునిగాయన్నారు. వరద నీరు తగ్గిన తర్వాత క్షేత్ర స్థాయిలో ఏఈఓలు సర్వే చేసి పంట నష్టం అంచనా వేస్తారని చెప్పారు. పత్తి, మొక్కజొన్న పంటలకే పాక్షికంగా నష్టం జరుగుతుందని, వరి పంటకు ఎలాంటి నష్టం జరగదన్నారు. పంట నష్టం పై సర్వే చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

భూమిని కబ్జా చేశారంటూ ఆందోళన

మిరుదొడ్డి(దుబ్బాక): పట్టా భూమిని కబ్జా చేశారని ఆరోపిస్తూ మిరుదొడ్డి మండల కేంద్రంలో పాత బస్టాండ్ వద్ద దళిత మహిళలు మంగళవారం ఆందోళనకు దిగారు. తమ కుటుంబ సభ్యుల్లో ఒకరైన చిన్నగల్ల బద్దవ్వ పేరున 1022/అ/3 సర్వే నంబర్‌లో పాత బస్టాండ్ సమీపంలోని కట్టు కాలువ వద్ద ఉన్న 0.0800 గుంటల పట్టా భూమిని అదే గ్రామానికి చెందిన నేరండ్ల భూమాగౌడ్, నేరండ్ల రామాగౌడ్‌లు ఆక్రమించుకుని షెడ్డు నిర్మించారని అన్నారు. దాన్ని తొలగించే ప్రయత్నం చేయగా ఈవిషయం తెలుసుకున్న పోలీసులు ఇక్కడికి చేరుకున్నారు. దీంతో వారికి దళిత మహిళలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇటీవల దుబ్బాక కోర్టు ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ కూడా తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్న స్థానిక పోలీసులపై చర్యలు తీసుకోవాలని సిద్దిపేట సీపీకి ఫిర్యాదు చేసినట్లు మహిళలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం గ్రామపంచాయ కార్యదర్శిపై మంగళవారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ అనే మానవ హక్కుల సంస్థ అధ్యక్షుడు శివ సిద్దిపేట కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్టీఐ చట్టం ప్రకారం పంచాయతీలో రికార్డులు తనిఖీ చేయగా లక్షల రూపాయల అవినీతి జరిగినట్లు బయట పడిందన్నారు. దీంతో ఫిర్యాదుదారుడు గాజుల సంపత్‌ను కార్యదర్శి బెదిరిస్తున్నాడని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

సిద్దిపేటకమాన్: పేకాట ఆడుతున్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగదు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ శివారు రంగీలా దాబా చౌరస్తా సమీపంలోని లారీ అసోసియేషన్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో కొంతమంది పేకాట ఆడుతున్నారని పోలీసులకు నమ్మదగిన సమాచారం వచ్చింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టూటౌన్ పోలీసులు వెళ్లి దాడులు చేశారు. లారీ వెనక క్యాబిన్‌లో అక్రమంగా పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.8,365లతో పాటు 11 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

వ్యక్తికి రిమాండ్

సిద్దిపేటకమాన్: తప్పుడు పత్రాలు సృష్టించి ఇతరులకు భూమిని విక్రయించి వారి నుంచి డబ్బులు తీసుకుని మోసం చేసిన ఘటనలో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం లింగారెడ్డిపల్లికి చెందిన వంగ రమేశ్‌రెడ్డి తన పూర్వీకులు గతంలో అమ్ముకున్న మోఖాలో లేని భూమిని తమకు చెందినదిగా పలువురిని నమ్మించి డాక్యుమెంట్లు సృష్టించాడు. ఇతరుల భూమిని చూపి తన భూమిగా నమ్మించి కొద్ది నెలల క్రితం పట్టణానికి చెందిన బ్రహ్మంకు విక్రయించాడు. విషయం తెలుసుకున్న బాధితుడు సిద్దిపేట టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం రమేశ్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోహెడరూరల్(హుస్నాబాద్): ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను లోడ్ చేస్తుండగా పెట్రోలింగ్‌కు వచ్చిన పోలీసులు పట్టుకున్నారు. పోరెడ్డిపల్లె శివారు.. మోయతుమ్మెద వాగులో మంగళవారం ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తుండగా పెట్రోలింగ్‌కు వెళ్లిన హెడ్‌కానిస్టేబుల్ కొమురయ్య, ఇద్దరు కానిస్టేబుల్‌లు గుర్తించారు. పోలీసుల రాకను గమనించిన వారు ట్రాక్టర్‌ను వదిలి పరాయయ్యారు. ట్రాక్టర్ నంబర్‌తో పరిశీలించగా బస్వాపూర్‌కు చెందిన రమేశ్‌గా గుర్తించారు.

బైక్ చోరీ

హుస్నాబాద్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో పార్క్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అక్కన్నపేట మండలం జనగామకు చెందిన కంకణాల రాజిరెడ్డి తన బైక్‌ను బస్టాండ్ సమీపంలో పార్క్ చేశాడు. పని ముగించుకొని పార్క్ చేసిన ప్రదేశానికి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. అక్కడున్న సీసీ కెమెరాను పరిశీలిస్తే బైక్ ఎత్తుకెళ్లిన వ్యక్తి దృశ్యం నమోదైంది. బాధితుడు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నేటి తరానికి స్ఫూర్తి ఐలమ్మ



జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌లో ..



కోహెడరూరల్‌లో..



మిరుదొడ్డిలో...

నేటి తరానికి వీర నారి చిట్యాల ఐలమ్మ స్ఫూర్తి అని వక్తలు అన్నారు. ఆమె వర్ధంతి సందర్భంగా విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ కనబరిచిన తెగువ ప్రస్తుత సమాజానికి, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన వీర వనిత అని కొనియాడారు. సబ్బండ వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

– నెట్‌వర్క్



హుస్నాబాద్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



గజ్వేల్‌రూరల్: దాతర్‌పల్లిలో..



కొమురవెల్లిలో..



సిద్దిపేటజోన్: హౌసింగ్ బోర్డ్ చౌరస్తాలో..

సంక్షిప్త వార్తలు

◆ అధ్యక్షుడిగా జైపాల్ రెడ్డి

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండల జర్నలిస్టుల నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అర్బన్ కమిటీ అధ్యక్షుడిగా రామసాగరం జైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కెమ్మసారం శ్రీనివాస్, కోశాధికారిగా బండిపల్లి శ్రీనివాస్ గౌడ్, ఆఫీస్ ఇన్‌చార్జిగా భూంపల్లి శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు భైరి సతీశ్, బొగ్గుల సంతోశ్ కుమార్, గుజ్జరి అరుణ్ కుమార్, మరుపల్లి స్వామిగౌడ్, జవ్వాజి మహేశ్, పోతరాజు రమేశ్, జొంగోని నరేశ్‌గౌడ్, అందె అంకుశ్ ఉన్నారు.

◆ శాంతియుతంగా నిమజ్జనం జరుపుకోవాలి

దుబ్బాకటౌన్: శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జనోత్సవాలను ఆనందంగా జరుపుకోవాలని సిద్దిపేట ఏసీపీ మధు అన్నారు. మంగళవారం దుబ్బాక సీఐ కార్యాలయంలో వినాయక మండపాల నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా యూత్ సభ్యులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగరాజు, తదితరులున్నారు.

◆ సత్వరమే స్పందించాలి

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద చాలా ఉందని, ప్రజలు ఫోన్ చేస్తే సత్వరం స్పందించి సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. మంగళవారం ఆయన ఎనిమల్ బర్త్ కంట్రోల్ యూనిట్(ఏబీసీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

◆ నూతన కార్యవర్గం ఎన్నిక

కొమురవెల్లి(సిద్దిపేట): మండల ప్రింట్ మీడియా నూతన కార్యవర్గాన్ని మంగళవారం మండలంలోని రసులాబాద్ రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంబటిపల్లి నాగరాజు, గౌరవ అధ్యక్షులుగా శీలం చందు, తుంగ పవన్‌కుమార్, జిల్లా అజయ్, మంకాల నగేశ్, ఉపాధ్యక్షులుగా కాపర్తి మల్లికార్జున్, మాచర్ల విక్రమ్, ప్రధానకార్యదర్శిగా దుద్దెడ నర్సింహులను, ఇతర కార్యవర్గ సభ్యులను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



వర్గల్(గజ్వేల్): ఏడాది క్రితం మృతిచెందిన మిత్రుడు బబ్బూరి రాజులుగౌడ్‌ను స్మరించుకుంటూ వర్గల్ మండలం మజీద్‌పల్లికి చెందిన అతని స్నేహితులు మంగళవారం 300 మంది ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు శివరాములుగౌడ్, విజేందర్‌గౌడ్, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, మహేశ్ యాదవ్, కృష్ణగౌడ్, రాజుగౌడ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్

దుబ్బాకటౌన్: సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రాయపోల్ మండల కేంద్రానికి చెందిన పుట్ట అనూష తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా ఏబీ పాజిటివ్ రక్తం అత్యవసరమైంది. సమాచారం తెలుసుకున్న సిద్దిపేట కానిస్టేబుల్ ప్రతాప్ గౌడ్, రాఘవాపూర్ టీఆర్ఎస్వీ నాయకులు పిట్ల రాకేశ్ వెంటనే స్పందించి ఆస్పత్రికి వెళ్లి రక్తం దానం చేశారు. వారికి అనూష కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ నైపుణ్యం పెంపునకే నమూనా పరీక్ష

కొండపాక(గజ్వేల్): పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం అచీవ్‌మెంట్ నమూనా పరీక్షను నిర్వహిస్తోందని మండల ఎంఎన్ఓ సత్తయ్య పేర్కొన్నారు. కొండపాక, కుకునూరుపల్లి మండలంలోని అన్ని పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (2024) నమూనా పరీక్షల 1ను మంగళవారం నిర్వహించింది.

◆ సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

బెజ్జంకి(సిద్దిపేట): కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నందున అప్రమత్తంగా పని చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కార్యదర్శులకు సూచించారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.

◆ మొక్కజొన్న పంట పరిశీలన

మద్దూరు(హుస్నాబాద్): రైతు కొమ్మరాజుల రమేశ్ మొక్కజొన్న పంటను మంగళవారం తోర్నాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సీహెచ్ పల్లవి, జక్కుల విజయ్ పరిశీలించారు. మండలంలోని కూటిగల్‌లో ఆయన ఆ పంట సాగు చేయగా దిగుబడిపై ఆందోళనకు గురవుతున్నాడు. దీంతో వారు ఇక్కడికి చేరుకుని పరిశీలించి మొక్కజొన్న పంట బాగుందన్నారు. 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు.